# పెంచిన వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి!

- ధరలు పెంచుతూ ప్రజల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం
- సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.జగన్.
- పోల్కంపల్లి గ్రామంలో మోడీ దిష్టి బొమ్మ దహనం



**ఇబ్రహీంపట్నం, మార్చి08, (నేటి దర్శిని ప్రతినిధి):** బిజెపి ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరలకు నిరసనగా ఆదివారం ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి గ్రామంలో నరేంద్ర మోడీ దిష్టి బొమ్మను దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి. జగన్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సామాన్యుడి నడ్డి విరుస్తూ గృహ వినియోగ వంట గ్యాస్ సిలిండర్ ధరను రూ.60లు, కమర్షియల్ సిలిండర్ ధరను రూ.115లు పెంచడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుంటే, ఇప్పుడు గ్యాస్ ధర పెంచడం పేద, మధ్యతరగతి కుటుంబాలకు అదనపు భారమవుతుందన్నారు. దేశ సంపదను అంబానీ, అదానీ వంటి కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తూ, పేదప్రజలపై అదనపు భారాలు విధించే కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలు ప్రజలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని అన్నారు. తక్షణమే పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని, నిత్యావసర వస్తువుల ధరల అదుపుకు తక్షణమే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు చెరుకూరి నర్సింహా, శాఖ కార్యదర్శులు మాద్గుల కర్ణాకర్ రెడ్డి, పంది యాదయ్య, సీనియర్ నాయకులు గూడెం అశోక్, ఎ.పాండు, సీహెచ్.బాల్ రాజ్, పూల యాదగిరి, జి.దానయ్య, డి.శివ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

- అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు
- యూత్ అధ్యక్షుడు కొంగరి యాదగిరి



**యాచారం, మార్చి08,(నేటిదర్శిని):** మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ రాయికంటి విజయ్ కుమార్, విహెచ్పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ళ జంగయ్య,జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ అధ్యక్షుడు నూకం కృష్ణ హాజరై వారు మాట్లాడుతూ.. మహిళలు చేస్తున్న సేవలను గుర్తు చేస్తూ కొనియాడుతూ శుభాకాంక్షలు తెలియజేశారు.మహిళలు సమాజ నిర్మాణానికి బలమైన పునాది అని నాయకులు పేర్కొన్నారు. మహిళల సాధికారతే సమాజ అభివృద్ధికి దారి చూపుతుందని సందేశం ఇచ్చారు. మహిళలు, మహిళా సంఘాలు పెద్దలు ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశావర్కర్లు, మహిళా సంఘాలు, విద్యా కమిటీ చైర్మన్ ఒ వైస్ చైర్మన్, రేషన్ డీలర్లు, వివిధ యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# వరంగల్ నగరానికి భూగర్భ డ్రైనేజ్ కి నిధులు

- మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ , ఎమ్మెల్యే లు కృతజ్ఞతలు



**ఉమ్మడి వరంగల్, మార్చి 8 (నేటి దర్శిని బ్యూరో):** వరంగల్ మహానగరానికి భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.5,257.20 కోట్లకు పాలనాపరమైన మంజూరు ఇవ్వడం పట్ల శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ వరంగల్ మహానగరానికి భూగర్భ డ్రెయినేజీ ప్రాజెక్టు మంజూరు చేయడం ద్వారా దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ప్రజల కలను ముఖ్యమంత్రి నెరవేర్చారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో రెండో ప్రధాన నగరంగా వరంగల్ మహానగరాన్ని అభివృద్ధి చేస్తామని ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతున్నారని ఎంపీ తెలిపారు. మౌలిక సదుపాయాలు, వైద్య, విద్య, రవాణా తదితర అన్ని రంగాల్లో వరంగల్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తోందని ఎంపీ అన్నారు. భూగర్భ డ్రెయినేజీ ప్రాజెక్టు అమలుతో నగరంలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు వరద ముంపు సమస్యలు కూడా తగ్గుముఖం పడతాయని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు వరంగల్ మహానగర అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు.వరంగల్‌ను రెండో రాజధానిగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం పలు కీలక ప్రాజెక్టులను అమలు చేస్తున్నదని చెప్పారు. త్వరలోనే మామునూర్ ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయని, అలాగే రైల్వే వ్యాగన్ ఫ్యాక్టరీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ స్థాపనతో పాటు కాకతీయ టెక్స్‌టైల్ పరిశ్రమల ప్రారంభానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు అమలులోకి వస్తే , ఆర్థిక కొత్త దశకు చేరుకుంటుందని డా.కడియం కావ్య స్పష్టం చేశారు.


# మున్ననూర్ గ్రామంలో మహిళా సంఘం భవనం భూమిపూజ






**మిడ్జిల్, మార్చి08, (నేటి దర్శిని ప్రతినిధి):** మిడ్జిల్ మండలంలోని మున్ననూర్ గ్రామంలో మహిళా సంఘాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని మహిళా సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ చిట్టంపల్లి సుజాత మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. భూమి పూజ కార్యక్రమాన్ని గ్రామ పెద్దలు, మహిళా సంఘ సభ్యులు మరియు గ్రామస్తుల సమక్షంలో శుభంగా ప్రారంభించారు. మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు మరియు మహిళల ఆర్థిక అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించడానికి ఈ భవనం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ గ మాట్లాడుతూ గ్రామంలోని మహిళల సాధికారతకు, వారి అభివృద్ధికి గ్రామపంచాయతీ ఎప్పుడూ సహకరిస్తుందని చెప్పారు. మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా ఎదగాలని, ఈ భవనం వారికి ఒక వేదికగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళా సంఘ సభ్యులు, యువత మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# అడ్డగోలు అక్రమ నిర్మాణాలు





- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న భారీ షెడ్డు నిర్మాణాలు.
- టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు
- ఏసీబీ అధికారులు గాఢ నిద్రలో...
- ఏసీపీ కనుసన్నల్లోనే అక్రమాలకు ఊతమన్న ఆరోపణలు

**వనస్థలిపురం,మార్చి08 (నేటి దర్శిని):** హయత్ నగర్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు అడ్డగోలుగా సాగుతున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణల మధ్య పుట్టగొడుగుల్లా భారీ వాణిజ్య నిర్మాణాలు వెలుస్తుండటం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది. అక్రమ నిర్మా ణాలను అరికట్టాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు కళ్లుమూసుకోవడంతో హయత్ నగర్ సర్కిల్ వనస్థలిపురం డివిజన్ వనస్థలి హాస్పిటల్ ప్రక్కన ఉపాధి అక్రమ కమర్షియల్ షెడ్ నిర్మాణం పనులు నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. తాజాగా అవినీతి నిరోధక శాఖ దాడుల్లో టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతి బయటపడినా అధికారుల తీరు మారకపోవడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చూడాలని, ఈ అక్రమ భారీ షెడ్డు వెంటనే కూల్చివేయాలని సామాజికవేత్తలు స్థానికులు కోరుతున్నారు.

# ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం

- జరుపుకున్న ఆమనగల్ పద్మశాలి మహిళా సంఘం..



**ఆమనగల్, మార్చి 08 (నేటి దర్శిని ప్రతినిధి);** ఆమనగల్ పట్టణంలోని మార్కండేయ దేవాలయం ఆవరణలో పద్మశాలి మహిళా సంఘం ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆదివారము నాడు ఘనంగా జరుపుకున్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన 15వ వార్డు కౌన్సిలర్ ఎంగలి భాగ్యలక్ష్మి రఘు గారిని మహిళా సంఘం నాయకురాళ్లు వారిని పూలమాలలతో శాలువాలతో సన్మానించి అభినందిస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మహిళా సంఘం అధ్యక్షురాలు అప్పం అలివేలు ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు విద్యా, ఉపాధి , రాజకీయ రంగాల్లో ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. మహిళలు పురుషులతో సమానంగా ఆత్మస్థైర్యంతో అన్ని రంగాల్లో పోటీ పడాలని అన్నారు. మహిళలు అందరూ కలిసి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో అప్పం శ్రీలత, చెరుకు భారతమ్మ, గాజుల రాధ, గాజుల స్వప్న, మసన శ్రీదేవి,మామిడి శెట్టి నవ్య , భావండ్ల స్వప్న, మరియు మార్కండేయ దేవస్థానం కమిటీ సభ్యులు గాజుల సత్య రాములు , యంగలి రఘు ,చెరుకు రవి, ఎంగలి శ్రీధర్, దోర్నాల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక
www.epaper.netidarshini.com
సోమవారం 9-3-2026

# మహబూబ్ నగర్ మేయర్ ను సన్మానించిన బీసీ సమాజ్



**మిడ్జిల్, మార్చి08, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మహబూబ్ నగర్ మేయర్ జి.మమత గారిని బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా సూర్యా రావు మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా ఉన్న ముదిరాజ్ సామాజిక వర్గం నుంచి మమత మహబూబ్ నగర్ తొలి మేయర్ గా చరిత్రలో నిలిచిపోయిందన్నారు..భవిష్యత్తులో మహబూబ్ నగర్ లో ఉన్నతమైన స్థానంలో నిలవాలని, క్షేత్రస్థాయిలోని సమస్యలను స్వయంగా పర్యవేక్షిస్తూ ముందుకు పోవడాన్ని హర్షించారు..ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శివార్చక విజయకుమార్, బీసీ సమాజ్ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు మోడల శ్రీనివాస్ సాగర్ తదితరులు పాల్గొన్నారు..

# వీణవంక మండల మహిళా మణులకు హుజురాబాద్ ఏసీపీ మాధవి సన్మానం






**హుజురాబాద్, మార్చి08 (నేటి దర్శిని ప్రతినిధి):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా హుజురాబాద్ సబ్ డివిజనల్ పోలీస్ ఆధ్వర్యంలో సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హుజురాబాద్ ఏసీపీ మాధవి మేడం పర్యవేక్షణ వహించారు.ఈ సందర్భంగా వీణవంక మండలానికి చెందిన వివిధ గ్రామాల మహిళా సర్పంచులు, ఉప సర్పంచులు మరియు వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన మహిళా మణులను ఘనంగా సన్మానించారు. మహిళల సేవలను గుర్తిస్తూ వారికి శాలువాలు కప్పి సత్కరించారు.అనంతరం ఏసీపీ మాధవి మాట్లాడుతూ మహిళలు నేటి సమాజంలో అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని పేర్కొన్నారు. కుటుంబ బాధ్యతలను నిర్వహిస్తూ సమాజ అభివృద్ధిలో కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని ఆమె అన్నారు. మహిళలు ధైర్యంగా ముందుకు సాగుతూ తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గోనెల సమ్మన్న ముదిరాజ్ (కవి), దరిపెల్లి మురళి (సింగర్), పొట్టాల శివకుమార్ (సింగర్) తమ గానంతో మహిళలను కొనియాడి కార్యక్రమాన్ని ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట గ్రామీణ సీఐ, వీణవంక ఎస్సై, హుజురాబాద్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

- పాల్గొన్న బోడుప్పల్ మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్



**మేడ్చల్ మల్కాజ్గిరి/ మేడిపల్లి: మార్చి 08,(నేటి దర్శిని):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బోడుప్పల్ నగరంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మహిళలకు శుభాకాంక్షలు తెలిపి, కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ, సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. ప్రతి రంగంలోనూ మహిళలు తమ ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగడం గర్వకారణమని అన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన, రక్షణ మరియు గౌరవం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు మహిళా నాయకులు, స్థానిక నివాసితులు మరియు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలను స్రవంతి కిషోర్ గౌడ్ శాలువాతో సత్కరించారు.



# మిడ్జిల్ వ్యాపార సంఘం ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న వ్యాపార సంఘం అధ్యక్షులు గంజి. కృష్ణ



**మిడ్జిల్,మార్చి08 (నేటి దర్శిని ప్రతినిధి):** మిడ్జిల్ మండల కేంద్రంలోఅంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బస్టాండు ఆవరణలో గణేష్ బతుకమ్మ ఉత్సవా కమిటీ సభ్యులు కేక్ కట్ చేయడం జరిగింది.. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి హైమావతి వారు మాట్లాడుతూ... మిడ్జిల్ మహిళలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ.. మహిళలు విద్యాపరంగా, ఆర్థికంగా మరియు రాజకీయంగా ఎదిగినప్పుడే మన సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని మాజీ జెడ్పిటిసి.హైమావతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మిడ్జిల్ వ్యాపార సంఘ అధ్యక్షులు గంజి. కృష్ణ మాట్లాడుతూ... మహిళలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ..ప్రతి మహిళ తమ పిల్లలను మంచి విద్యతో ముందుకు తీసుకువెళ్లి వారిని సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా తీర్చిదిద్దాలని వారు పిలుపునిచ్చారు. మహిళలు అభివృద్ధి చెందినప్పుడే సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గణేష్ బతుకమ్మ ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

# ఎస్.కె.ఎస్ జీనియస్ స్కూల్‌లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

- నేటి ఆధునిక కాలంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు - ప్రిన్సిపాల్ అనిత కుమారి




**కొండమల్లేపల్లి, మార్చి 8 (నేటి దర్శిని):** స్థానిక మండల కేంద్రంలోని ఎస్.కె.ఎస్ జీనియస్ స్కూల్ (ూఝీ ఖఱఅవతీ ూశ్రీఱఎ డ్రాతీవ ూఎష్ట్రశీశ్రీ) లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ మహిళా శక్తికి ప్రతీకగా నిలిచింది. ఈ వేడుకల్లో పాఠశాల ప్రిన్సిపాల్ అనిత కుమారి మాట్లాడుతూ, ప్రతి ఇంట్లో మహిళా మూర్తి పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. "పిల్లల ఎదుగుదలలో తల్లి పాత్ర అత్యంత కీలకమని, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడంలో తల్లులు ఇచ్చే సహకారం అభినందనీయమని" ఆమె పేర్కొన్నారు. నేటి ఆధునిక కాలంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ పురుషులతో సమానంగా గుర్తింపు పొందుతున్నారని, ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవించాలని ఆమె పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఈ కార్యక్రమంలో మహిళల కోసం ప్రత్యేకంగా ఆహ్లాద పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటారు. పోటీల్లో విజేతలకు ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అదేవిధంగా పాఠశాల తరపున హాజరైన ప్రతి ఒక్కరికీ ప్రత్యేకంగా మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాళ్లు చిన్ని, సరిత, మనీషా మరియు పాఠశాల సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

# మహిళా దినోత్సవం సందర్భంగా అనాథ పిల్లలకు అల్పాహారం




- కృష్ణ గోపాల్ సేవా సమితి సేవా కార్యక్రమం





**ఎల్.బి.నగర్, మార్చి08 (నేటి దర్శిని ప్రతినిధి):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో అనాథ పిల్లలకు అల్పాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సమితి అధ్యక్షుడు కపిల్ కుమార్ అగర్వాల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ మహిళలు మన జీవితంలో అత్యంత ముఖ్యమైన స్తంభమని, సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర అపారమని అన్నారు. మహిళల గౌరవం మరియు సమానత్వాన్ని గుర్తుచేసుకుంటూ ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు. అనంతరం అనాథ పిల్లలకు అల్పాహారం అందజేశారు.ఈ కార్యక్రమంలో సమితి అధికారులతో పాటు మహిళా మండలి సభ్యులు దివ్య అగర్వాల్, తేజశ్రీ పాల్చం, పాకా అరుణ యాదవ్, దోమలపల్లి హిందూజా, గూడూరు శ్వేత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

